క్లుప్తంగా

గంపలగూడెం ఎస్‌ఐగా రాంబాబు

గంపలగూడెం: గంపలగూడెం ఎస్‌ఐగా పీ రాంబాబు శనివారం బాధ్యతలు చేపట్టారు. మైలవరం ఎస్‌ఐగా పనిచేస్తున్న ఆయన్ను ఉన్నతాధికారులు ఇక్కడకు బదిలీ చేశారు. 2020 అక్టోబర్ 7 నుంచి ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన వి.సతీష్‌ను తిరువూరు సెక్టార్-1 ఎస్‌ఐగా బదిలీ చేశారు.

తిరువూరు ఎస్‌ఐగా సతీష్

తిరువూరు: తిరువూరు పోలీస్‌స్టేషన్ సెక్టార్-1 ఎస్‌ఐగా వీ సతీష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసే ఎస్‌ఐ దుర్గాప్రసాద్ వేకెన్సీ రిజర్వుకు వెళ్లగా, గంపలగూడెంలో పనిచేస్తున్న సతీష్‌ను తిరువూరులో నియమించారు.

ఎస్‌ఐగా సత్యనారాయణ బాధ్యతలు

విస్సన్నపేట: విస్సన్నపేట ఎస్‌ఐగా జీవీవీ సత్యనారాయణ శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఎస్‌ఐగా పని చేసిన పరిమి కిషోర్ విజయవాడ సీసీఎస్‌కు బదిలీపై వెళ్లగా భవానిపురం పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా పని చేస్తున్న సత్యనారాయణ విస్సన్నపేట ఎస్‌ఐగా నియమితులయ్యారు.

19న మారెమ్మ అమ్మవారి హుండీ కానుకల లెక్కింపు

విస్సన్నపేట: మండలంలోని పుట్రేల గ్రామంలో ఉన్న మారెమ్మ అమ్మవారి దేవస్థానానికి చెందిన హుండీ కానుకలను ఈ నెల 19వ తేదీ ఉదయం 10.30 గంటలకు లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ వై సీతారామయ్య శనివారం తెలిపారు. దేవదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కోటగిరి సునీల్ బాబు, రెవెన్యూ, పోలీస్ అధికారులు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, భక్తుల సమక్షంలో ఆలయ ఆవరణలో హుండీ కానులకు లెక్కించనున్నట్లు పేర్కొన్నారు.

బీసీ కులగణన నిర్ణయం ప్రశంసనీయం

ఇబ్రహీంపట్నం: దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న బీసీ కులగణన చేపట్టేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం ప్రశంసనీయం అని బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు నిడుముక్కల శివశంకరరావు అన్నారు. ఇబ్రహీంపట్నం లోని ఆయన కార్యాలయంలో శనివారం మాట్లాడుతూ కుల గణన వలన ప్రభుత్వానికి ఎటువంటి ఆర్థికభారం పడకపోవడమే కాకుండా విద్యా ఉద్యోగాలు, ప్రభుత్వం పదవులు సంక్షేమ పథకాలకు ఏ కులానికి ఏవిధమైన బడ్జెట్ రూపొందించాలనే అవగాహన ప్రభుత్వ పెద్దలకు ఉంటుందన్నారు. కులగణనతో 52 శాతానికి పైగా ఉన్న బీసీలకు న్యాయం జరుగుతుందని హర్షం వ్యక్తం చేశారు.

33 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు

మైలవరం: ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మైలవరం నియోజకవర్గంలోని 33 మందికి రూ.23.34లక్షలు మంజూరైంది. సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ శనివారం లబ్ధిదారులకు అందజేశారు. ఇబ్రహీంపట్నం మండలంలో ఎనిమది మందికి రూ. 4.66లక్షలు, జీ.కొండూరు మండలంలోని 10 మందికి రూ.9.15 లక్షలు, మైలవరం మండలంలోని 7గురికి రూ.4.46 లక్షలు, రెడ్డిగూడెం మండలంలోని ఆరుగురికి రూ.3.02 లక్షలు, విజయవాడ రూరల్ మండలంలో ఇద్దరికి రూ.2.05 లక్షలు మంజూరయ్యాయి.

ఎన్టీటీపీఎస్‌లో అగ్నిమాపక వారోత్సవాలు

ఇబ్రహీంపట్నం: డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్‌లో అగ్నిమాపక వారోత్సవాలు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫైర్, సేఫ్టీ అధికారులు అగ్ని ప్రమాదాలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవల్సిన జాగ్రత్తలపై ఉద్యోగులు, కార్మికులకు వివరించారు. ఎస్‌ఈ కె.జవహర్, సేఫ్టీ అధికారి నాగబాబు, ఫ్యాక్టరీ మేనేజర్ సుబ్రహ్మణ్యం, ఫైర్, సేఫ్టీ ఏడీఈ రమణ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వడ్రంగి వర్కర్ నచర్ల వెంకటాచారి కుటుంబానికి సీఐటీయూ ఆధ్వర్యంలో రూ. 25వేలను శనివారం అందజేశారు. నగదు బ్యాంకులో జమచేసి మృతుడి భార్యకు బ్యాంక్ పత్రాలు అందించారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.మహేష్, ఉపాధ్యక్షుడు రామకృష్ణ పాల్గొన్నారు.

మట్టి నమూనాలపై శిక్షణ

రెడ్డిగూడెం: మండలంలోని నరుకుళ్లపాడు రైతు భరోసా కేంద్రంలో భూసార పరిరక్షణ, మట్టి నమూనాల సేకరణపై శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డిగూడెం మండల వ్యవసాయాధికారి ఆర్. సురేష్ మాట్లాడుతూ నేలలోని సేంద్రియ కర్బనం, లవణ సాంద్రత, ఉదజని స్థూల, సూక్ష్మ పోషకాలు విలువను భూసార పరీక్షలు నిర్వహించి తెలుసుకోవచ్చన్నారు.

గొల్లపూడి ఆర్‌బీకేలో..

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని రైతు భరోసా కేంద్రంలో భూసార సంరక్షణ, మట్టి నమూనాల సేకరణపై గ్రామ వ్యవసాయ శాఖ అధికారులకు శనివారం శిక్షణ ఇచ్చారు. వ్యవసాయ శాఖ ఏడీఏ వెంకటేశ్వరరావు, సాయిల్ టెస్టింగ్ ల్యాబ్ ఏడీఏ బీ పద్మజ, ఏఓ రంగనాథ్ బాబు (విజయవాడ రూరల్), ఏఓ రఘురామ్ (విజయవాడ అర్బన్) పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే రక్షణనిధి



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

ఏ.కొండూరు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి అన్నారు. ఏ.కొండూరులో శనివారం రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ గ్రామంలో 1,220 కుటుంబాలకు పలు రకాల ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా రూ. 13.49 కోట్లు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశామన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరుతుందన్నారు. ఇచ్చిన హామీలు 100 శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా అన్ని రకాల సౌకర్యాలతో రూ.40 లక్షలతో గ్రామ సచివాలయం, రూ.20 లక్షలతో రైతు భరోసా కేంద్రం నూతనంగా నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా జల్‌జీవన్‌మిషన్ పథకం ద్వారా రూ. 50 లక్షలతో ఇంటింటికీ తాగునీటి కుళాయిలను కూడా త్వరలో ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. సీసీ రహదారులు ఏర్పాటు చేయటానికి మరో రూ. 20లక్షలు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంపాటి రజిని, వైస్ ఎంపీపీ సిద్దం పద్మ, ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు భూక్య గనియా, వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు కాలసాని చెన్నారావు, పీఏసీఎస్ చైర్మన్లు కోటగిరి రాంబాబు, పాలం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: సంక్షేమం, అభివృద్ధే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యం అనిఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. నూజివీడు మండలం ముక్కొల్లుపాడులోను, శివారు నెహ్రూనగర్‌లో శనివారం రాత్రి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతాప్ కాలనీలోని ఇంటింటికీ వెళ్లి ఈ నాలుగేళ్లలో ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి కలిగిన లబ్ధిని వివరించారు. ఇళ్ల స్థలాలు, అమ్మఒడి, ఆసరా, జగనన్న తోడు, విద్యాదీవెన, వసతిదీవెన, రైతుభరోసా, సున్నావడ్డీ తదితర అనేక పథకాల వల్ల లబ్ధి కలిగిందని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని ఎమ్మెల్యే కోరారు. నాలుగేళ్ల పాలనలో ప్రభుత్వ పథకాల్లో ఏదో ఒక పథకం ప్రతి ఇంటికి చేరిందన్నారు. టీడీపీ నాయకులు చెప్పే మాయమాటలు నమ్మొద్దని, చంద్రబాబు వస్తే ఈ పథకాలన్నీ రద్దవుతాయని చెప్పారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోన్న జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో విద్యా సంక్షేమ, మౌలిక సదుపాయల కల్పనా సంస్థ డైరెక్టర్ కలగర వెంకటేశ్వరరావు, సర్పంచి కంచర్ల సుబ్బలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు అన్నమ్మ, నాయకులు పల్లె రవీంద్రరెడ్డి, ముల్లంగి జమలయ్య పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పదో తరగతి పరీక్షలు



నూజివీడు సెయింట్ మేరీస్ స్కూల్లో పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు

నూజివీడు: ఈ నెల 3న ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. డివిజన్ పరిధిలోని 15 పరీక్ష కేంద్రాల్లో శనివారం నిర్వహించిన సోషల్ పరీక్షకు 49 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 3,290 మంది విద్యార్థులకు 3,241 మంది హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్, వైద్య సిబ్బందిని నియమించారు. 144 సెక్షన్ అమలు చేశారు.

1,145 మంది హాజరు

మైలవరం: మండలంలో శనివారం జరిగిన పదో తరగతి సోషల్ స్టడీస్ పబ్లిక్ పరీక్షకు 1,145 మంది విద్యార్థులు హాజరైనట్లు మండల విద్యాశాఖాధికారి పీ రత్నశ్యామ్‌బాబు తెలిపారు. 24 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: మండలంలో 854 మంది విద్యార్థులకు గాను ఐదు పరీక్ష కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు నిర్వహించారు. గంపలగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల, తోటమూల శాన్‌జోస్ ఇంగ్లిష్ మీడియం స్కూలు, సరస్వతి స్కూల్, ఉటుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాల, సిద్దార్థ విద్యాలయం కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షల్లో 12 మంది విద్యార్థులు గైరాజరయ్యారు. పరీక్షలు ముగియడంతో ఆయా కేంద్రాల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా స్నేహితులకు ఒకరికొకరు వీడ్కోలు పలుకుతూ ఇళ్లకు వెళ్లారు.

అగ్నిప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



అగ్నిప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుపుతున్న సిబ్బంది

నూజివీడు: అగ్నిప్రమాదాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నూజివీడు అగ్నిమాపక కేంద్రం ఫైర్ ఆఫీసర్ భాస్కరరామం సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక బస్టాండు ప్రాంతంలోనూ, రద్దీగా ఉన్న ప్రదేశాల్లోను అగ్నిప్రమాదాల నివారణపై ముద్రించిన కరపత్రాలను శనివారం పంపిణీ చేశారు. వంటగదిలో అన్ని వైపుల నుంచి వెలుతురు, గాలి వచ్చేటట్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పాడైపోయిన గ్యాస్ ట్యూబ్‌లను వాడకూడదని, ఐఎస్‌ఐ మార్కు ఉన్న ట్యూబ్‌లనే ఉపయోగించాలన్నారు. వంట పూర్తయిన వెంటనే సిలిండర్ రెగ్యులేటర్ వద్ద ఆఫ్ చేయాలన్నారు. వంటగదిలో కిరోసిన్, డీజిల్, పెట్రోల్, అదనపు గ్యాస్ సిలిండర్లను ఉంచకూడదని సూచించారు. దుస్తులకు నిప్పు అంటుకున్నప్పుడు కంగారుపడి పరిగెత్తకూడదని, నేలపై పడుకుని దొర్లాలన్నారు. ఐఎస్‌ఐ మార్కు కలిగిన విద్యుత్ పరికరాలను, ఎలక్ట్రికల్ సాకెట్ కెపాసిటీకి తగిన ప్లగ్‌ను వాడాలని సూచించారు. ఇంటి నుంచి ఎక్కువ రోజులు సెలవులపై బయటకు వెళ్తున్నప్పుడు ఎలక్ట్రికల్ మెయిన్‌ను ఆఫ్ చేయాలన్నారు. విద్యుత్ వల్ల అగ్నిప్రమాదం సంభవిస్తే ముందుగా మెయిన్ స్విచ్ ఆఫ్ చేయాలన్నారు. ప్రతి గృహంలో కార్బన్‌డై యాక్సైడ్ సిలిండర్‌ను ఉంచుకోవాలన్నారు. వరిగడ్డి వాములను ఇంటికి కనీసం 60 అడుగుల దూరంలో ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

మైలవరం: అగ్ని ప్రమాదాలతో అప్రమత్తంగా ఉండాలని ఫైర్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు తెలిపారు. అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం రైతు బజారు, బస్‌స్టాండ్, సినిమా హాల్స్ వద్ద అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ మైక్ ద్వారా ప్రచారం చేసి, కరపత్రాలు పంపిణీ చేశారు.

'మా నమ్మకం నువ్వే జగన్'కు విశేష స్పందన



తిరువూరులో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం



కాట్రేనిపాడులో ప్రచారం చేస్తున్న స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ స్వరూపరాణి

తిరువూరు: పట్టణంలోని పలు వార్డులలో శనివారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన కుటుంబాలకు మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమ బ్రోచర్లను అందజేసి వారి నుంచి ఫీడ్ బ్యాక్ నమోదు చేశారు. నగరపంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వైస్ చైర్‌పర్సన్లు విజయలక్ష్మి, వెంకటేశ్వరి, వార్డు కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు, మూడు దుర్గారావు, పాలం రమాదేవి, పరసా సత్యనారాయణ, షేక్ నదియా, చిన్నారి, వార్డు ఇన్‌చార్జిలు తిరుమలశెట్టి వేణు, షేక్ జాకీర్, గజ్జల సీతారామారావు పాల్గొన్నారు. ఆంజనేయపురం, కాకర్ల, మల్లేల, ముష్టికుంట్ల, ఎర్రమాడు, పెద్దవరం, అక్కపాలెం గ్రామాల్లో కూడా ఈ కార్యక్రమం నిర్వహించారు.

పుల్లూరులో..

పుల్లూరు(మైలవరం): 'మా నమ్మకం నువ్వే జగనన్న'కు వాడ వాడలా విశేష స్పందన లభిస్తోంది. మైలవరం మండలం పుల్లూరు గ్రామంలో ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి ఆశీస్సులతో పీఏసీఎస్ అధ్యక్షుడు చిలుకూరి రామిరెడ్డి సారథ్యంలో సర్పంచ్ కొనకాల నాగమల్లేశ్వరి ఇంటింటికీ తిరుగుతూ స్టిక్కర్లు అంటించారు. మండలంలోని వెల్వడంలో పీఏసీఎస్ అధ్యక్షుడు తోట వెంకట తిరుపతిరావు అధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి వైఎస్సార్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించారు. వారి అనుమతితో తలుపులకు స్టిక్కర్‌లు అంటించారు. చంద్రాల గ్రామంలో సర్పంచ్ జే జ్యోతి ఆధ్వర్యంలో వైఎస్సార్ రైతు సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ గంగాధరరావు ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలు వివరిస్తూ, వారి అభిప్రాయాలు నమోదు చేశారు.

ముసునూరులో..

ముసునూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాలు జెడ్పీటీసీ సభ్యుడు, సచివాలయాల కన్వీనర్ వరికూటి ప్రతాప్ ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, గ్రామ పెద్దలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రెట్టించిన ఉత్సాహంతో శనివారం సాయంత్రం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. కాట్రేనిపాడులో స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ పి.స్వరూపరాణి స్థానిక సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ కృష్ణకుమారి సుబ్బారావు, వైస్ ఎంపీపీ గంగాధర్, గ్రామ పార్టీల అధ్యక్షులు జగనన్న ప్రవేశ పెట్టిన పథకాలను వివంచారు.

నూజివీడులో..

నూజివీడు: పట్టణం, మండలంలో శనివారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటి వద్ద గృహాల యజమానుల అనుమతితో స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని పేర్కొన్నారు.

ఇన్‌చార్జి సెక్రటరీగా బసవలింగేశ్వరరావు

జి.కొండూరు: జి.కొండూరు పంచాయతీ ఇన్‌చార్జి సెక్రటరీగా బసవలింగేశ్వరరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో సెక్రటరీగా పనిచేసిన సత్యవాణి బదిలీపై వెళ్లడంతో పంచాయతీరాజ్ శాఖ బసవలింగేశ్వరరావుకు అదనపు బాధ్యతలు అప్పగించింది.

నిస్వార్థ రాజకీయవేత్త 'కంచి'



తిరువూరు: రాజకీయాల్లో నిస్వార్థంగా వ్యవహరించిన మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ కంచి రామారావు నేటి తరం రాజకీయవేత్తలకు ఆదర్శప్రాయుడని తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి అన్నారు. శనివారం తిరువూరు శ్రీరస్తు కల్యాణమంటపంలో కంచి రామారావు సంస్మరణ సభ జరిగింది. ఆయనకు పలువురు రాజకీయ నాయకులు నివాళులర్పించారు. తిరువూరు ప్రాంత అభివృద్ధికి పాటుపడిన కంచి రామారావు ఎల్లకాలం ఈ ప్రాంత ప్రజలకు గుర్తుంటారన్నారు. విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నానీ), తిరువూరు నియోజకవర్గంలోని పలువురు ప్రజా ప్రతినిధులు ఈ సంతాప సభలో మాట్లాడారు.

రంజాన్ తోఫా పంపిణీ

తిరువూరు: రంజాన్ మాస సందర్భంగా తిరువూరులో ముస్లింలకు ఒక మహిళ నిత్యావసర సరుకులు, చీరెలు పంపిణీ చేశారు. స్థానిక లైన్‌బజారులో నివసించే అబీదాఖాన్ అనే మహిళ శనివారం 150 మందికి రంజాన్ తోఫా అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉటుకూరులో ఇఫ్తార్ విందు

ఉటుకూరు(గంపలగూడెం): రంజాన్ ఉపవాస దీక్షలో పాల్గొన్న ముస్లింలకు శనివారం రాత్రి మండలంలోని ఉటుకూరులో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. జామియా మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ రహంతుల్లా ఏర్పాటు చేసిన ఇఫ్తార్లో 150 మంది ముస్లింలు పాల్గొన్నారు.

రూ.3.74 లక్షల అపరాధ రుసుం విధింపు

నూజివీడు: మండలంలోని రూరల్ సెక్షన్ పరిధిలో విద్యుత్ వినియోగదారుల గృహాలు, వాణిజ్య సముదాయాల్లో విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు శనివారం తనిఖీలు చేశారు. విజిలెన్స్ ఈఈ వెంకటేశ్వర్లు, ఆపరేషన్స్ ఈఈ డీ కృష్ణానాయక్ నేతృత్వంలో విద్యుత్ అధికారులు, సిబ్బంది 39 బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో 2,715 గృహ సర్వీసులను, 147 వాణిజ్య సర్వీసులను, 9 ఇతర సర్వీసులను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో 127 సర్వీసులకు అదనపులోడు 187 కిలోవాట్లకు సంబంధించి రూ.3.74 లక్షల అపరాధ రుసుం విధించారు. మీటరు లేకుండా విద్యుత్ చౌర్యం చేస్తున్న ఇరువురికి రూ.25 వేలు, మీటరులో నుంచి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఇరువురికి రూ.25 వేలు జరిమానా వేశారు. విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని, చౌర్యానికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈఈ డీ కృష్ణనాయక్ హెచ్చరించారు. ఎవరైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతుంటే 94408 12362 కు తెలియజేయాలని కోరారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన కమిషనర్



అభివృద్ధి పనులు చేపట్టాలని హైవే సిబ్బందికి సూచిస్తున్న కమిషనర్ వెంకటేశ్వర్లు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీ ఏరియాలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు శుక్రవారం సుడిగాలి పర్యటన చేశారు. స్థానిక జాకీర్ హుస్సేన్ కళాశాల రోడ్డులో పర్యటించి 65వ నంబర్ జాతీయ రహదారుల సంస్థ స్థలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించారు. మురుగు నీటి పారుదలకు ఆటంకం లేకుండా పనులు చేపట్టాలని హైవే సిబ్బందికి సూచించారు. పట్టణంలో పారిశుద్ధ్యం పనులు పరిశీలించి కార్మికులకు సూచనలు చేశారు. దుర్గాకాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. చిన్నారులకు అందించే పౌష్టికాహారం పరిశీలించి, ఆటపాలతో కూడిన విద్యా బోధన చేయాలన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వార్డు కౌన్సిలర్ భూలక్ష్మి పాల్గొన్నారు.

మే 13న మెగా లోక్‌అదాలత్



పోలీసు అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా జడ్జి నాగశైలజ

నూజివీడు: మే నెల 13న నిర్వహించే జాతీయ మెగా లోక్‌అదాలత్‌లో సాధ్యమైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక కోర్టు భవనాల ఆవరణలో స్థానిక న్యాయాధికారులు, పోలీస్ అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. పరిష్కరించదగిన క్రిమినల్, సివిల్, మోటార్ వాహనాలు, ఇతర కేసులు కలిపి గతం కంటే ఎక్కువ పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. లోక్‌అదాలత్‌లో పరిష్కరించే కేసులకు అప్పీలుండదని, కక్షిదారుల సమయం, డబ్బు ఆదా అవుతుందని చెప్పారు. సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెదఖాసిం, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి డి.దుర్గాకల్యాణి, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.సాయిరామ్, స్పెషల్ మెజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి, డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్‌గౌడ్, నూజివీడు టౌన్ సీఐ ఎంవీఎస్ఎస్‌మూర్తి పాల్గొన్నారు.

నాడు-నేడు పనులను వెంటనే ప్రారంభించాలి

ఏపీసీ మహేశ్వరరావు



గంపలగూడెంలో మాట్లాడుతున్న మహేశ్వరరావు

గంపలగూడెం: నాడు-నేడు రెండో ఫేజ్‌లో ఎంపికైన పాఠశాలల్లో పనులను వెంటనే చేపట్టాలని ఏపీసీ జీ మహేశ్వరరావు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న నాడు-నేడు పనులను తనిఖీ చేసేందుకు శనివారం ఆయన గంపలగూడెం విచ్చేశారు. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో నాడు-నేడు పథకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని ఐదు పాఠశాలలో నాడు-నేడు పనులు ప్రారంభించకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తునికిపాడు హైస్కూల్లో అదనపు తరగతి గదులు కిచెన్ షెడ్డు, పెనుగొలను ఎలిమెంటరీ పాఠశాల(ఎన్‌పీ) మండల పరిషత్ స్కూలు (బీసీ కాలనీ), తునికిపాడు (హెచ్ డబ్ల్యూ) పాఠశాల, ఉటుకూరు ఉర్దూ పాఠశాలల్లో వంటగది, మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టకపోవడం ఏమిటని ప్రశ్నించారు. సోమవారం నాటికి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. మండలంలోని 36 పాఠశాలల్లో నిర్వహిస్తున్న పనుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా ఆయన ఉటుకూరు, తునికిపాడు, పెనుగొలను గ్రామాల్లో నాడు-నేడు పథకంలో ఎంపికైన పాఠశాలలను తనిఖీ చేశారు. సీఎంఓ టి.రాంబాబు, ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి, ఎంఈఓ సోమశేఖర్‌నాయక్, జీసీడీఓ శాంతి, ఏఎల్ఎస్ఓ సుధాకర్, పీఆర్ ఏఈ పూర్ణచంద్రరావు పాల్గొన్నారు. కాగా మహేశ్వరరావు నెమలి వేణుగోపాలస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రహదారి సమస్యపై వినతి

ముసునూరు: గ్రామ ప్రజలు తమ సమస్యలను పరిష్కరించు కోవాలని వైస్ ఎంపీపీ కె.రాజానారాయణ పేర్కొన్నారు. తహసీల్దార్ దాసరి సుధ అధ్యక్షతన శనివారం రాత్రి లోపూడి గ్రామ సచివాలయంలో రాత్రి సభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పేరం కృష్ణ, ఉపసర్పంచ్ బాబూరావు ప్రధాన గ్రామం నుంచి శివారు గ్రామం బాసవరప్పాడు వెళ్లే రహదారి సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్‌ను కోరారు. అనంతరం గ్రామంలోని పలు సమస్యలపై అధికారులు గ్రామస్తులతో చర్చించారు. గ్రామంలోని మహిళా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సభలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు అధికారులను కోరారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సత్యనారాయణ, ఆర్ఐ చంద్రశేఖర్, వీఆర్ఓ నవీన్, ఆదర్శ రైతు బలుమూరి నరసింహారావు పాల్గొన్నారు.

చీరల పంపిణీ

తిరువూరు: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు రంగప్రకాష్ వివాహ వార్షికోత్సవ సందర్భంగా తిరువూరులో క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు శనివారం చీరలు పంపిణీ చేశారు. స్థానిక బోస్ సెంటర్లో జరిగిన కార్యక్రమంలో క్లబ్ పట్టణ అధ్యక్షుడు దోసపాటి రవికుమార్, రీజియన్, జోనల్ చైర్మన్లు పవన్‌కుమార్, ఎస్.రామారావు, జిల్లా క్లబ్ ప్రతినిధులు రాజేశ్వరరావు, వెంకటరమణయ్య, అనురాధ, సూర్యప్రకాశరావు, సుధాకర్ పాల్గొన్నారు.

చాట్రాయి: మండలంలోని పర్వతాపురంలో క్రీస్తు రక్షణ సంఘం వారి ఆధ్వర్యంలో మహిళలకు శనివారం చీరలు పంపిణీ చేశారు. మేరీస్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ జె.ఐజక్(విజయవాడ) సుమారు 50 మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మిద్దె శివాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు మిద్దె సత్యనారాయణ, చర్చి పాస్టర్ వంగల యోనోష్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలి

ఆగిరిపల్లి: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ అడుగుజాడల్లో ప్రతిఒక్కరూ నడవాలని ఎంపీపీ గోళ్ల అనూషా ఇసాక్, ఎస్సై ఎస్.చంటిబాబు అన్నారు. మండలంలోని ఈదరలో శుక్రవారం రాత్రి అంబేడ్కర్ జయంతిని బీంరావ్ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు మొగదాటి జోజిబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ అనూషా ఇసాక్, ఎస్ చంటిబాబు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ దన్నపనేని వెంకట సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు దన్నపనేని సత్యంబాబు, సంఘం అధ్యక్షుడు జోజిబాబు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

శీతలపానీయాలు తాగొద్దు

తిరువూరు: వేసవిలో దాహార్తి తీర్చుకునేందుకు శీతల పానీయాలను ఆశ్రయించవద్దని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్ సూచించారు. స్థానిక సుందరయ్య భవన్‌లో శనివారం శీతల పానీయాలతో కలిగే అనర్థాలు వివరిస్తూ జేవీవీ రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. రసాయనాలు, విషపూరిత పదార్థాలుండే శీతల పానీయాలతో అనారోగ్యంబారిన పడే అవకాశం ఉన్నందున ప్రకృతి సిద్ధ పానీయాలను సేవించాలని గంగాధర్ కోరారు. కొబ్బరిబోండాలు, పండ్ల రసాలు తీసుకుంటే వేసవి దాహార్తి నుంచి ఉపశమనం పొందవచ్చని, ఆరోగ్యం కాపాడుకోవచ్చని తెలిపారు. కరపత్ర ఆవిష్కరణలో జేవీవీ ప్రతినిధులు పాపారావు, రాంప్రదీప్, సుందర్శన్, ప్రభాకరరావు, నాగేంద్రప్రసాద్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీ సమర్థవంతంగా జరగాలి

జి.కొండూరు: రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులను సమర్థవంతంగా పంపిణీ చేయగలిగితే రైతులకు మేలు జరుగుతుందని వ్యవసాయ సలహా మండలి జిల్లా సభ్యుడు కాజా బ్రహ్మయ్య అన్నారు. స్థానిక ఏఓ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం అధ్యక్షుడు జమ్ముల హనుమంతురావు అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ హాజరై ప్రసంగించారు. ఏఓ రాంకుమార్ పాల్గొన్నారు.